aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
BEST OPTIONS TO LEARN IN HYDERABAD
9160600630 & 9640123485
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
గురువారం
07-05-2026 సంపుటి : 01 సంచిక : 46 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

- ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదు
- రౌండ్ టేబులు సమావేశంలో కవిత



హైదరాబాద్, మే 06( మహ ప్రభ)
ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు.

-మిగతా 3 లో

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

- సీఎం అభ్యర్థిపై బీజేపీలో సమాలోచనలు
- ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు




కోల్‌కతా, మే 06( మహ ప్రభ)
పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే

-మిగతా 3 లో




## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచాన
- 95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్, మే 06( మహ ప్రభ)
:ధాన్యం కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ.. రైతులను ఆందోళనకు గురిచేయడంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు అంశంపై ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తూ, రైతులను అయోమయానికి గురిచేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తోందని, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

-మిగతా 3 లో

# రైతుబంధు ఆపిందెవరు?


### రైతుబీమా, బోనస్‌ను బొంద పెట్టిందెవరు?

- మోసం చేసి గద్దెనెక్కి రైతు వారోత్సవాలా?
- సీఎం ఢిల్లీకి చక్కర్లు కొట్టుడు తప్ప చేసిందేంటి?
- ప్రజల గురించి పట్టించుకునే దిక్కు లేదు
- వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్



హైదరాబాద్, మే 06( మహ ప్రభ)
: రైతుబంధును ఆపి, రైతుబీమాను బొందపెట్టిందెవరు? రూ. 2లక్షల రుణమాఫీ, రూ. 500 బోనస్ ఎగ్గొట్టిందెవరు? అంటూ కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రైతుబంధు పథకాన్ని ఆపడానికి తామేమైనా దివానాగాళ్లమా? అని రేవంత్‌రెడ్డి అన్నారని, ఇప్పుడు ఒక్కసారే వేసి మిగతా మూడుసార్లు ఆపిందెవరని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎకే విమానం, దిగే విమానం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని, రైతు వారోత్సవాల పేరుతో

-మిగతా 3 లో




## కేరళ సీఎం ఎవరు?

- ఢిల్లీలో కాంగ్రెస్ మంతనాలు
- కీలక నేతలతో అధిష్ఠానం వరుస భేటీలు..
- మల్లికార్జున ఖర్గేతో సమావేశమైన రమేష్ చెన్నితల.. వీడీ సతీషన్
- రేసులో రమేష్ చెన్నితల, వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్ పేర్లు
- కేరళ సీఎం ఎంపికపై కొనసాగుతున్న సందిగ్ధత
- నేడు సీఎల్పీ సమావేశం.. శాసనపక్ష నేత ఎంపిక

న్యూఢిల్లీ, మే 06( మహ ప్రభ)
కేరళ సీఎం ఎవరు.. అన్నదానిపై ఉత్కంఠ నెలకొన్నది. కేరళలో యూడీఎఫ్ కూటమి భారీ విక్టరీ సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంపికపై దేశ రాజధాని ఢిల్లీలో మంతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. సీఎం ఎవరికి ఇవ్వాలన్న దానిపై అధిష్ఠానం వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితల, వీడీ సతీషన్ భేటీ అయ్యారు. అయితే, సీఎం రేసులో వీడీ సతీషన్, రమేష్ చెన్నితల, కేసీ వేణుగోపాల్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రేసులో రమేష్ చెన్నితల.. వీడీ సతీషన్.. కేసీ వేణుగోపాల్ పేర్లు కేరళ అసెంబ్లీ ఎన్నికలలో యూడీఎఫ్ నాయకత్వంలోని భారీ విజయం సాధించింది. ఇప్పుడు కొత్త ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియ ఢిల్లీ వేదిక అయ్యింది.

-మిగతా 3 లో




## పంజాబ్ కింగ్స్‌పై సన్ రైజర్స్ జయభేరి

- ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచులో 33 పరుగుల తేడాతో విజయం
- టేబుల్ టాపర్‌గా అవతరించిన సన్ రైజర్స్
- హ్యాట్రిక్ ఓటములు చవిచూసిన పంజాబ్ కింగ్స్

న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)
ఐపీఎల్ 2026లో టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌కు షాక్ ఇస్తూ.. సన్ రైజర్స్ హైదరాబాద్ ఘన విజయం సాధించింది. బుధవారం ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచులో 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పంజాబ్ కింగ్స్‌ను వెనక్కి నెట్టి పాయింట్స్ టేబుల్‌లో

-మిగతా 3 లో



## భారత్-వియత్నాం ద్వైపాక్షిక వాణిజ్యం

### 25 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం

ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. ఇరుపక్షాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఫార్మాస్యూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సంస్కృతితో సహా పలు రంగాలలో లోతైన ద్వైపాక్షిక సంబంధాలకు అవకాశం కల్పిస్తాయి.

3 లో

# మెట్రోలో కేంద్రం భాగస్వామి కావాలి

### ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టండి


- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విన్నతి
- డీపీఆర్‌ను సమర్పించామని వివరణ
- ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ కోసమే ప్రభుత్వ ఆధీనంలో ఫేజ్ 1

హైదరాబాద్ మే 06( మహ ప్రభ)
హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో

-మిగతా 3 లో







## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

- 118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి
- మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన
- పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం
- గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ
- నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత

చెన్నై,మే 06( మహ ప్రభ)
టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల

-మిగతా 3 లో

## మోడీ టూర్ షెడ్యూల్ ఇదీ!

- ఈ నెల 10న రాష్ట్రానికి రాక
- మధ్యాహ్నం మూడింటికి హైటెక్స్ నుంచి వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం
- సాయంత్రం ఐదున్నరకు పరేడ్ గ్రౌండ్స్‌లో పబ్లిక్ మీటింగ్



హైదరాబాద్, మే 06( మహ ప్రభ)
దేశ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్ర పర్యటన ఖరారు అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని పర్యటన పురస్కరించుకుని ప్రత్యేక బందోబస్తు నిర్వహించనుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించనున్న రూ. 7,800 కోట్ల విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలకు రాజధాని నగరం హైదరాబాద్‌లోని హైటెక్స్ నుంచి ఈ నెల 10న ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని...

-మిగతా 3 లో

# ఎట్టి పరిస్థితుల్లోనూ విజయ్ పార్టీకి సహకరించం..

**అన్నాడీఎంకే సంచలన ప్రకటన..!**



**న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)**
తమిళనాడు లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే టీవీకే అధ్యక్షుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మరో ఆరు సీట్లు తక్కువ పడుతున్నాయి. విజయ్‌కి కాంగ్రెస్ పార్టీ మాత్రమే మద్దతు పలికింది. వీసీకే, సీపీఐ, సీపీఐ (ఎం), ఐయూఎంఎల్ లాంటి చిన్న పార్టీలు మాత్రం టీవీకేకు మద్దతిచ్చేందుకు ససేమీరా అంటున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్‌కి అన్నాడీఎంకే మద్దతిచ్చే అవకాశాలు ఉన్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారాన్ని అన్నాడీఎంకే పార్టీ కొట్టిపారేసింది.అన్నాడీఎంకే డిప్యూటీ కోఆర్డినేటర్ కేపీ మునుసామి బుధవారం సాయంత్రం మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌కి కావాల్సిన స్థానాలు, వచ్చాయా లేదా అనే అంశంతో తమకు సంబంధం లేదని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టీవీకేకు అన్నాడీఎంకే సహకరించదని స్పష్టంచేశారు. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 సీట్లు గెలుచుకుంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు అవసరం. కాంగ్రెస్ పార్టీ డీఎంకేను పక్కన పెట్టి, విజయ్‌కి మద్దతిస్తోంది.అయినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మరికొందరు ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతివ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నట్లు వార్తలు వచ్చాయి. అన్నాడీఎంకేకు 47 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. సుమారు 30 మంది విజయ్‌తో చేతులు కలపడానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే విజయ్‌తో కలిసేందుకు పార్టీ అధినేత పళనిసామి మాత్రం సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ డిప్యూటీ కోఆర్డినేటర్ మునుసామి నుంచి పై ప్రకటన వెలువడింది.

# విజయ్‌కి తమిళనాడు గవర్నర్ షాక్

**మెజారిటీ లేనిదే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించలేం..**



**న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)**
తమిళనాడు రాజకీయాలు అనూహ్య మలుపు తిరిగాయి. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైన టీవీకే అధినేత విజయ్ కి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాకిచ్చారు. లోక్‌భవన్ లో గవర్నర్‌ను కలిసిన విజయ్‌కి ఆయన సంఖ్యాబలం విషయంలో స్పష్టమైన నిబంధనలను గుర్తుచేశారు. తగినంత మెజారిటీ లేనిదే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేమని స్పష్టంచేశారు. దాంతో తమిళనాడులో రాజకీయ సస్పెన్స్ మరింత ముదిరింది.తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మ్యాజిక్ ఫిగర్ 118. అయితే ప్రస్తుత సమీకరణాల ప్రకారం టీవీకే బలం 107 సీట్లు. విజయ్ రెండుచోట్ల గెలవడంతో ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రస్తుతం టీవీకే బలం 107 మాత్రమే. మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ బలం 5 సీట్లు. దాంతో మొత్తం బలం 112 అవుతుంది. ఈ క్రమంలో విజయ్ పార్టీకి మరో 6 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఈ క్రమంలోనే మెజారిటీ లేనందున ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదువిజయ్ గవర్నర్‌తో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోపాటు మరికొన్ని చిన్న పార్టీలు తమకు మద్దతు ఇస్తున్నాయని, ప్రమాణస్వీకారం తర్వాత అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకుంటామని చెప్పారు. అయితే ముందే 118 మంది సభ్యుల సంతకాలతో కూడిన మద్దతు లేఖ ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతిస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. దాంతో ఇతర పార్టీల మద్దతు కూడగట్టే పనిలో టీవీకే ఉన్నది. ఈ క్రమంలో అన్నాడీఎంకే పార్టీకి ఉన్న 47 మంది ఎమ్మెల్యేలలో సీవీ షణ్ముగం నేతృత్వంలోని ఒక వర్గం (సుమారు 35 మంది) విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు పీఎంకే (4), ఐయూఎంఎల్ (2), సీపీఐ (2), సీపీఎం (2) వంటి పార్టీల మద్దతు కూడా కూడగట్టడంపై టీవీకే నేతలు చర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతానికి ఈ 6 మంది ఎమ్మెల్యేల కొరత తీరితే తప్ప విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం లేదు. మే 9న ప్రమాణస్వీకారం చేయాలని టీవీకే భావిస్తున్న తరుణంలో వచ్చే 24 గంటలు అత్యంత కీలకంగా మారాయి.

# ఆ పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలన్న కేంద్రం..

**తిరస్కరించిన సుప్రీంకోర్టు..!**



**న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)**
కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యత్వాన్ని తొలగిస్తూ.. కొత్త చట్టం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు లో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. అయితే కేంద్రం అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. తాను 'శబరిమలలో మహిళల ప్రవేశం' కేసును పర్యవేక్షిస్తున్నందున కేసును కొద్ది రోజులపాటు వాయిదా వేయాలని కేంద్రం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానాన్ని కోరారు.కాగా తుషార్ మెహతా అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్త తిరస్కరించారు. ఈ పిటిషన్‌పై విచారణ అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. చాలా రోజుల క్రితమే విచారణ తేదీని ఖరారు చేశామని, ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని స్పష్టంచేశారు. శబరిమల కేసును అసలు విచారించకపోవడమే మంచిదని మంగళవారం 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసం చేసిన వ్యాఖ్యలను జస్టిస్ దత్తా ప్రస్తావించారు. కాగా సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన లేవనెత్తారు.ఇప్పటికే ఈ చట్టం కింద జరిగిన నియామకాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఆ పిటిషన్‌లపై విచారణ జరుగుతోంది.

# లోదుస్తుల్లో జార్జియా మెలోనీ..

**ఫేక్ ఫోటోలపై ఇటలీ ప్రధాని వార్నింగ్**




**న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)**
కృత్రిమ మేధతో పెను ప్రమాదం ఉన్నట్లు ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ వార్నింగ్ ఇచ్చారు. ఏఐ టెక్నాలజీతో సమాచారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఇక నకిలీ ఫోటోలను కూడా షేర్ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. జార్జియా మెలోనీ లోదుస్తులు ధరించినట్లుగా ఉన్న కొన్ని ఫోటోలు ఇటీవల ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇటలీ ప్రధాని సీరియస్ అయ్యారు. ఆమె ఓ స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. ఏఐ టెక్నాలజీతో తయారు చేసిన అనేక ఫేక్ ఇమేజ్‌లు ఆన్‌లైన్‌లో వ్యాప్తి అవుతున్నాయని, ఇవే వాస్తవమైన ఫోటోలు అని రాజకీయ ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.అయితే ఏఐ వల్ల ఉన్న ప్రమాదాలను ఎత్తిచూపేందుకు స్వయంగా తన ఎక్స్ అకౌంట్‌లో ఓ నకిలీ ఫోటోను జార్జియా మెలోనీ పోస్టు చేశారు. టెక్నాలజీని దుర్వినియోగం చేసి ఇలాంటి ఫోటోలను రూపొందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇది వ్యక్తిగత దాడి కన్నా ఎక్కువ ప్రమాదకర అంశమని ఆమె తన వార్నింగ్‌లో పేర్కొన్నారు. ఏఐ ఆధారిత డీప్‌ఫేక్‌లతో చాలా ప్రమాదం ఉందని, ఆ విధానంతో ఎవరినైనా మోసం చేయవచ్చు అని, తలకిందలు చేయవచ్చు అని, ఎవరినైనా దాడి చేయవచ్చు అని ఆమె అన్నారు.ఇలాంటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు, తనను తాను సమర్థించుకోగలను, కానీ ఈ పొజిషన్ అందరికీ ఉండదని ఆమె అన్నారు. ఆన్‌లైన్ కాంటెంట్‌ను షేర్ చేస్తున్న సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. నమ్మడానికి ముందు వెరిఫై చేసుకోవాలని, ఆ తర్వాత షేర్ చేసే ముందు మరోసారి ఆలోచించాలని, ఇలాంటి రూల్ పెట్టుకోవాలని జార్జియా మెలోనీ అన్నారు.

## బెంగాల్‌లో లెనిన్ విగ్రహం ధ్వంసం





**న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)**
2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకటనతో పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, మంగళవారం రాత్రి ముర్షిదాబాద్ జిల్లాలోని జియాగంజ్ ప్రాంతంలో వ్లాదిమిర్ లెనిన్ విగ్రహం ధ్వంసం చేయబడింది. ఈ ఘటనకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది, అందులో ధ్వంసమైన వ్లాదిమిర్ లెనిన్ విగ్రహం కనిపిస్తుంది. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో 206 స్థానాలు గెలుచుకుని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీని పదవీచ్యుతి చేసిన కొద్ది రోజులకే రాష్ట్రంలో హింస పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్టు సమాచారం

# బెంగాల్ సీఎం రేసులో అగ్నిమిత్ర పాల్ !



**కోల్‌కతా మే 06( మహ ప్రభ)**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్ర సీఎం రేసులో సువేందు అధికారితో పాటు దిలీప్ జోషి ఉన్నారు. అయితే మహిళలకు పెద్దపీట వేయాలనుకుంటున్న బీజేపీ.. బెంగాల్‌లో సీఎం పోస్టును మహిళకు కేటాయించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ చివరి నిమిషంలో మహిళను సీఎంగా ప్రకటించాలని ప్రయత్నిస్తే, ఆ పోస్టు రేసులో అగ్నిమిత్ర పౌల్ ముందు వరుసలో ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.మే 9వ తేదీన కొత్త సీఎం ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని బెంగాల్ బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. మరో వైపు సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని మమతా బెనర్జీ భీష్మించుకున్నారు. ఈ నేపథ్యంలో మహిళా సీఎం రేసులో అగ్నిమిత్ర పౌల్ ఉన్నట్లు తెలుస్తోంది. తాజా ఎన్నికల్లో అసన్‌సోల్ దక్షిణ్ సీటు నుంచి పోటీ చేసి ఆమె 40 వేల మెజారిటీతో గెలిచారు. మమతా బెనర్జీకి కౌంటర్ ఇవ్వాలని బీజేపీ భావిస్తే, అగ్నిమిత్ర పౌల్ ఆ రోల్ ప్లే చేసే అవకాశాలు ఉన్నాయి.అగ్నిమిత్ర ఓ ఫ్యాషన్ డిజైనర్. 2019 నుంచి 2024 వరకు ఎంపీగా చేశారామె. ఎన్నికల అఫిడవిట్‌లో ఆమెపై పెండింగ్ కేసులు ఉన్నాయి. ఇక ఆ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సామిక్ భట్టాచార్య కూడా సీఎం రేసులో ఉన్నారు.

# భార్యతో గొడవ.. ఇద్దరు మరదళ్లను కాల్చి చంపిన వ్యక్తి



**రాయ్‌పూర్: మే 06( మహ ప్రభ)**
ఒక వ్యక్తి తన భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడకు వెళ్లిన అతడు మళ్లీ గొడవపడ్డాడు. జోక్యం చేసుకున్న భార్య చెల్లెళ్లైన ఇద్దరు మరదళ్లను తుపాకీతో కాల్చి చంపాడు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. జితేంద్ర వర్మ బౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ఖిలేశ్వరితో తరచుగా గొడవపడేవాడు.కాగా, మంగళవారం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో భార్య ఖిలేశ్వరి తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో రాత్రి 9 గంటల సమయంలో మద్యం సేవించిన జితేంద్ర, మోవా ప్రాంతంలోని అత్త ఇంటికి చేరుకున్నాడు. తన పిల్లలను అప్పగించాలని గొడవపడ్డాడు. మరోవైపు ఖిలేశ్వరి చెల్లెళ్లైన గీతాంజలి, దుర్గేశ్వరి ఇంటి నుంచి బయటకు వచ్చారు. జిత్రేంద్రకు నచ్చజెప్పి అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. అయితే తమ కుటుంబ గొడవలో మరదళ్ల జోక్యంపై జితేంద్ర ఆగ్రహించాడు. వెంట తెచ్చిన లైసెన్స్ పిస్టల్‌తో వారిపై కాల్పులు జరిపాడు. నుదుటిపై బుల్లెట్ తగలడంతో గీతాంజలి అక్కడికక్కడే మరణించింది. వీపుపై బుల్లెట్ గాయమైన దుర్గేశ్వరిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది.అయితే ఇద్దరు మరదళ్లపై కాల్పుల తర్వాత జితేంద్ర, పాండ్రి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని లొంగిపోయాడు. దీంతో పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. హత్యకు వినియోగించిన పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# డీఎంకే అధినేత స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ..

**-క్లిష్ట సమయంలో అండగా ఉంటానని భరోసా!**



**న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)**
తమిళనాడు రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిణామాల మధ్య నేడు సూపర్ స్టార్ రజనీకాంత్ మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌తో భేటీ అయినట్లు తెలుస్తుంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తాను స్టాలిన్ వెంటే ఉంటానని, ఆయనకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తానని రజనీకాంత్ హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. కేవలం వ్యక్తిగత పలకరింపు కాకుండా, ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో స్టాలిన్‌కు ధైర్యం చెప్పడమే లక్ష్యంగా ఈ భేటీ జరిగినట్లు సమాచారం.మరోవైపు కాంగ్రెస్, ఇతర లెఫ్ట్ పార్టీలతో కలిసి టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తుంది. మే 07న విజయ్ ప్రమాణస్వీకారం ఉండబోతున్నట్లు సమాచారం

## పంజాబ్ కింగ్స్‌పై సన్ రైజర్స్ జయభేరీ

మొదటి తరువాయి

అగ్రస్థానానికి చేరింది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఇది వరుసగా మూడో ఓటమి కాగా, సన్ రైజర్స్ హైదరాబాద్‌కు మొత్తంగా ఏడో విజయం. ఓడిపోయినా.. పంజాబ్ కింగ్స్ బ్యాటర్ కూపర్ కన్నోలీ అజేయ శతకంతో ఒంటరిపోరాటం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్.. 235/4 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్.. ఆదిలోనే వికెట్లు కోల్పోయింది. ప్రియాన్ష్ ఆర్యా (1), ప్రభ్‌సిమ్రాన్ (3), శ్రేయస్ అయ్యర్ (5) త్వరగా పెవిలియన్ చేరిపోయారు. దీంతో 23 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పంజాబ్ కష్టాల్లో పడింది. మార్కస్ స్టోయినిస్ (28), సూర్యాన్ష్ షెగ్డే (25), మార్కో జాన్సెన్ (19) ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. దీంతో పంజాబ్ ఆలౌట్ అయ్యేలా కనిపించింది. కానీ సహచర బ్యాటర్లు విఫలమైన ఇదే పిచ్‌పై కూపర్ కన్నోలీ (59 బంతుల్లో 107 రన్స్) అజేయ శతకంతో సత్తాచాటాడు. చివరి ఓవర్‌లో శతకం పూర్తి చేసుకున్న అతడు.. జట్టుకు ఓటమి అంతరాన్ని తగ్గించాడు. ఈ మ్యాచులో ఓడినా.. భారీగా నెట్ రన్ రేట్ పడిపోకుండా కాపాడాడు. చివరకు పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. సన్ రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విక్టరీ సాధించింది. ఈ విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్, డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వెనక్కి నెట్టి మరి.. టేబుల్ టాపర్‌గా నిలిచింది. ఇప్పటికే ఏడు విజయాలు సాధించిన సన్ రైజర్స్.. ప్లే ఆఫ్స్‌కు చేరువైంది. మరొక్క మ్యాచులో గెలిస్తే.. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించనుంది!

## మెట్రోలో కేంద్రం భాగస్వామి కావాలి

మొదటి తరువాయి

ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశంతోనే మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సులభమవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్టును భారత ప్రభుత్వం - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ -- భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3 గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-3 కి సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

మొదటి తరువాయి

బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## మోడీ టూర్ షెడ్యూల్ ఇదీ!

మొదటి తరువాయి


నరేంద్ర మోడీ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానం ద్వారా హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి మధ్యాహ్నం గం. 2.25 ని.లకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గం. 2.30 గంటలకు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించే హైటెక్స్‌కు చేరుకుంటారు. అక్కడ గం. 2.30 నుంచి గం. 3ల వరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో పాటు, ప్రారంభోత్సవాలను వర్చువల్ గా ప్రారంభిస్తారు. ఆ తర్వాత తిరిగి రోడ్డు మార్గంలో గం. 3.05 ని.లకు బయలుదేరి గం. 3.10 ని.కు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అనంతరం గం. 3.15 ని.లకు రక్షణ శాఖ హెలికాప్టర్ (ఎంఐ-17) ద్వారా హైటెక్స్ హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి గం. 3.40 ని.లకు రోడ్డు మార్గంలో హైటెక్ సిటీ సమీపంలోని సింధూ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి బయలుదేరి గం. 3.45 ని.లకు చేరుకుంటారు. ఈ సందర్భంగా గం. 3.45 ని.ల నుంచి గం. 4.15 ని.ల వరకు సింధూ హాస్పిటల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. సింధూ హాస్పిటల్ నుంచి గం. 4.15 ని.లకు బయలుదేరి హైటెక్ సిటీ మీదుగా రోడ్డు మార్గంలో గం. 4.40 ని.లకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఈ సందర్భంగా బేగంపేట ఎయిర్ పోర్టు వద్ద గం. 4.40 ని.ల నుంచి సాయంత్రం గం. 5.25 ని.ల వరకు విశ్రాంతి తీసుకోనున్నారు. సాయంత్రం గం. 5.25 ని. నుంచి బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గంలో గం. 5.30 ని.లకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో బీజేపీ పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ సాయంత్రం గం. 6.30 ని వరకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి గం. 6.35 నుంచి గం. 6.40 వరకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి గం. 6.45 ని.లకు బయలుదేరి ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానం ద్వారా రాత్రి గం. 8.45 వరకు గుజరాత్ లోని జామ్ నగర్‌కు ప్రధాని చేరుకుంటారు.

# భారత్-వియత్నాం ద్వైపాక్షిక వాణిజ్యం

మొదటి తరువాయి

**న్యూఢిల్లీ:**

ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. ఇరుపక్షాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఫార్మాస్యూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సంస్కృతితో సహా పలు రంగాలలో లోతైన ద్వైపాక్షిక సంబంధాలకు అవకాశం కల్పిస్తాయి. భారత పర్యటనకు వచ్చిన వియత్నాం అధ్యక్షుడు టో లాం ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో మోడీ ప్రసంగించారు. భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వియత్నాం సహకారంతో ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం వియత్నాంతో కలిసి భారత్ పని చేస్తుందని తెలిపారు. పఠాన్‌కోట్ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటంలో అండగా నిలిచినందుకు వియత్నాంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక అనుసంధానతను పెంపొందించేందుకు రెండు దేశాల



కేంద్ర బ్యాంకుల మధ్య సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మోడీ వెల్లడించారు. ఇందులో భాగంగా యూపీఐ వ్యవస్థను వియత్నాం ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో త్వరలో అనుసంధానం చేయనున్నట్లు ప్రధాని వివరించారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోడీ తెలిపారు. ఇరు దేశాల మధ్య భద్రత సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వియత్నాం అధ్యక్షుడు టో లాం తెలిపారు. "2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లేందుకు అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. మన ఔషధ అధికార వర్గాల మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం వియత్నాంలో భారతీయ ఔషధాల లభ్యతను పెంచుతుంది. వియత్నాంకు భారతీయ వ్యవసాయ, మత్స్య, పశు ఉత్పత్తుల ఎగుమతి కూడా సులభతరం కాబోతోంది. "త్వరలోనే భారతదేశపు ద్రాక్ష, దానిమ్మ పండ్లను వియత్నాం రుచి చూస్తుంది, అలాగే మనం వియత్నాం పోమెలో పండ్లను రుచి చూస్తాము. అంతేకాకుండా, ఈ ఏడాది చివరి నాటికి భారత్-ఆసియాన్ వాణిజ్య ఒప్పందాన్ని ఆధునీకరించడానికి అంగీకరించాం. ఇది భారతదేశానికి, అన్ని ఆసియాన్ దేశాలకు మధ్య వాణిజ్యానికి, పెట్టుబడులకు కొత్త ఊపునిస్తుంది. కీలక ఖనిజాలు, అరుదైన భూలోహాలు, ఇంధన సహకారంలో కొత్త కార్యక్రమాలు మన రెండు దేశాల ఆర్థిక భద్రతను, సరఫరా గొలుసు మెరుగుపరుస్తాయి. అనుసంధానం, సామర్థ్య నిర్మాణం మన భాగస్వామ్యానికి ముఖ్యమైన స్తంభాలు. రెండు దేశాల మధ్య విమాన అనుసంధానం నిరంతరం పెరుగుతుండటం చాలా సంతోషంగా ఉంది." అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దక్షిణ చైనా సముద్రంలో చైనా తన సైనిక బలాన్ని పెంచుకుంటున్న విషయం కూడా ఇరుపక్షాల మధ్య జరిగిన ప్రతినిధి బృందం స్థాయి చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో కలిసి వచ్చిన వియత్నాం అధ్యక్షుడు లాం, మూడు రోజుల భారత్ పర్యటించనున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన దేశంలో చేస్తున్న తొలి అధికారిక పర్యటన ఇది. అంతకుముందు మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరియు ప్రధానమంత్రి మోడీ ఆయనకు స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చేముందు బిహార్‌లోని బోధ్ గయలోనూ పర్యటించి మహాబోధి ఆలయంలో ప్రార్థనలు చేశారు.

# రైతుబంధు ఆపిందెవరు?

మొదటి తరువాయి

డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.

**రైతులను ఉరికించి రేవంత్ మోసగించారు**

పదేండ్ల కేసీఆర్ పాలనలో అంతా సాఫీగా సాగుతుంటే కాంగ్రెస్ అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చి అన్నివర్గాలను మోసం చేస్తున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కేసీఆర్ పదివేలే ఇస్తుండు.. మేం రూ.15 వేలు ఇస్తాం. ఇప్పుడు తీసుకుంటే ఐదు వేలే.. డిసెంబర్‌లో తీసుకుంటే రూ.7,500 అంటూ సన్నాయి నొక్కులు నొక్కారు. ఉరుకుండ్రి రూ.2 లక్షలు అప్పు తెచ్చుకోండ్రి. డిసెంబర్ 9న సంతకం పెడుతామని ఉరికించి రైతులను మోసం చేశార'ని నిప్పులు చెరిగారు. కాంగ్రెసోళ్లను నమ్మి మోసపోతే గోసపడుతామని కేసీఆర్ చెప్పిండు. అప్పుడు రేవంత్‌రెడ్డి మేమేమన్నా హౌలాగాళ్లమా.. దివానాగాళ్లమా అని మాట్లాడిండు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు అందరినీ ఆదుకుంటామని రేవంత్ మోసం చేశారని విమర్శించారు. తెలంగాణ వార్తలు

**రైతుకు భూదేవికి ఉన్నంత ఓపిక**

రైతుకు భూదేవికి ఉన్నంత ఓపిక ఉంటదని కానీ ఓపి క నశిస్తే భూకంపం పుట్టించే శక్తి అదే రైతుకు ఉంటదని కేటీఆర్ చెప్పారు. 'రేవంత్ యాది పెట్టుకో! దేశానికి అన్నం పెట్టే అన్నదాతను అడుక్కునేటోనిలా చూస్తున్నవ్. కేసీఆర్ మీటింగ్ పెట్టగానే ఒక కిస్తు.. రెండో మీ టింగ్ పెడ్తే ఇంకో కిస్తు. మార్చిలో ఒక ఎకరం. ఏప్రిల్‌లో ఇంకో ఎకరానికి ఇస్తా అని తమాషాలు చేసుకుంట, బట్టేబాజీ మాటలు, బలుపు మాటలు మాట్లాడున్నడు..



నా ఇష్టం వచ్చినప్పుడు వేస్తా అంటే నీ ఇంటిముందు జోలె పట్టుకొని నిల్చునేటందుకు రైతులేమన్నా బిచ్చగాళ్లా? రైతుకు నాగలితో దున్నడం తెలుసు. అదే నాగలిని తిరగేసి కాంగ్రెసోళ్లను ఊరూరికి ఉరికిచ్చి ఉరికిచ్చి కొట్టడం కూడా తెలుసు' అని కేటీఆర్ హెచ్చరించారు.

**రేవంత్ రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం**

రాష్ట్రంలో రైతుబంధు వేసేందుకు సీఎం వద్ద డబ్బులు లేవు కానీ, రాహుల్‌గాంధీకి మూటలు పంపేందుకు మాత్రం డబ్బులు ఉంటాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రైతుబంధు పోయి రాహుల్‌బంధు అమలవుతున్నదని విమర్శించారు. అందుకే ఆయన రెగ్యుల్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం. నెలకోసారి కప్పం కట్టి రెన్యూవల్ చేయించుకోవాలి. లేకుంటే రేవంత్‌కు బతుకుదెరువు లేదు. కుర్చీ గుంజిపడేస్తరు. రైతులకు ఎగ్గొట్టి రాహుల్‌కు కప్పం కట్టి కుర్చీని కాపాడుకుంటున్న రేవంత్‌రెడ్డి యాది పెట్టుకో.. రైతులకు కోపం వచ్చిననాడు ఏ రాహుల్‌గాంధీ.. ఏ సోనియాగాంధీ.. ఏ ప్రియాంకాగాంధీ నీ కుర్చీని కాపాడలేరు. గుర్తు పెట్టుకో ఒక్కో ఎకరానికి రూ.26,500 బాకీ పడ్డరు. రూ.30వేల కోట్లు రైతులకు బాకీ పడ్డడు రేవంత్‌రెడ్డి' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**ఏతుల.. ఎగవేతల రేవంత్‌రెడ్డి**

'ఓట్లకు ముందు ఏతులు.. ఓట్లేసుకున్నంక ఎగవేతలు. ఏ రేవంత్‌రెడ్డి అంటే ఏతుల రేవంత్‌రెడ్డి, ఎగవేతల రేవంత్‌రెడ్డి' అని కేటీఆర్ అభివర్ణించారు. 'చివరి ఆరు నెలలకు మళ్లీ ప్రజలను మోసం చేయవచ్చని అనుకుంటున్నరు. యూరియా కష్టాలు, మక్కల రైతుల పడిగాపులు అన్నీ మర్చిపోతరు అనుకుంటున్నరు. రుణమాఫీ పంచపాండవులు మంచంకోళ్ల కథలెక్క ఉన్నది. ఒక్క ఊర్ల కూడా రుణమాఫీ కాలే. రేవంత్‌రెడ్డీ నీకు దమ్ముంటే ఏ ఊరికి పోదామో చెప్పు? నీ కొండారెడ్డిపల్లికి పోదా మా? గంగదేవిపల్లికి పోదామా? కొడంగల్‌కు పోదా మా? ఏ ఊరికి పోదామో చెప్పు ఏ ఊరిలోనైనా రైతులు 100శాతం రుణమాఫీ జరిగిందని రాసిస్తే శాశ్వతంగా నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని కేటీఆర్ సవాల్ విసిరారు. 'దమ్ముంటే సవాల్ స్వీకరించు.. రేవంత్‌రెడ్డి వస్తడా? తుమ్మల వస్తడా రండి. చారాణా జరిగింది వాస్తవమా కాదా?' అని ప్రశ్నించారు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

మొదటి తరువాయి

అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ రబీలో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. దాదాపు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో భాగంగా 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం 2.63 లక్షల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల (హీట్ వేవ్) నుంచి ధాన్యాన్ని, రైతులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు, ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని మంత్రి ఉత్తమ్ అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలి అనేది కూడా అధికారులకు సూచనలు చేశామని అన్నారు. ప్రతి కొనుగోలు సెంటర్లలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సివిల్ సప్లై భవన్ లో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి రోజు వెదర్ అలర్ట్ అన్ని కొనుగోలు సెంటర్లకు అందిస్తున్నామని..తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో ఎక్కువ కొనుగోలు సెంటర్ల ను ఏర్పాటు చేశామని... బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కంటే కాంగ్రెస్ హయంలో ఎక్కువ మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఏ రైతుకు ఇబ్బంది వచ్చిన కంట్రోల్ సెంటర్ కు పిర్యాదు చేయొచ్చని అన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

మొదటి తరువాయి

ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాధ్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేపపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. . రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.

## కేరళ సీఎం ఎవరు?

మొదటి తరువాయి

140 స్థానాలు ఉన్న కేరళ అసెంబ్లీలో యూడీఎఫ్ కూటమి 102 స్థానాలను గెలిచి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని సాధించింది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో ప్రస్తుతం ముగ్గురు ప్రధాన నేతల పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో అడ్వకేట్ వీడీ సతీషన్ ప్రతిపక్ష నేతగా పార్టీని విజయపథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. కూటమిలోని ముస్లిం లీగ్ మిత్రపక్షాల మద్దతు కూడా ఈయనకు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఇక రెండో సీనియర్ నేత అయితే మాజీ మంత్రి రమేష్ చెన్నితల పార్టీ కష్టకాలంలో ఉన్నవేళ అండగా నిలిచిన వ్యక్తి. ఢిల్లీలో ఇవాళ ఈయన మల్లికార్జున ఖర్గేతో మంతనాలు జరపడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇతని పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. అలాగే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు వినిపిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత, లోకసభ పక్ష నేత రాహుల్ గాంధీకి కేసీ వేణుగోపాల్ అత్యంత సన్నిహితుడు. జాతీయ రాజకీయాలలో కీలక పాత్రను పోషిస్తున్నప్పటికీ కేరళకు సీఎంగా రావాలని అధిష్ఠానం భావిస్తే ఈయన పేరు ఖరారయ్యే అవకాశం ఉన్నది. సీఎం అభ్యర్థిగా ఎలాంటి విభేదాలు తలెత్తకుండా హైకమాండ్ చాలా జాగ్రత్త పడుతోంది.

కేరళకు.. అబ్జర్వర్లు..

అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లను కేరళ అబ్జర్వర్లుగా నియమించింది. బుధవారం రాత్రికి అబ్జర్వర్లు చేరుకుంటారని కేరళ కాంగ్రెస్ ఇంఛార్జి దీపా దాస్ మున్షీ తెలిపారు. కొత్తగా ఎన్నికైనటువంటి కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభ్యర్థులుగా వ్యక్తిగతంగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించనున్నారు. తరువాత సీల్డ్ కవర్‌లో ఎమ్మెల్యేల అభిప్రాయాలను నివేదిక రూపంలో హైకమాండ్‌కు అందజేయనున్నారు. చివరగా సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేల చేతుల మీదుగా సీల్డ్ కవర్ ద్వారా వెలువడే అవకాశం ఉన్నది.

## సంపాదకీయం

# మమతా బెనర్జీ అహంకారం !



ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్దంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యూడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా ఆరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్ చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్‌ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరగిందని పాత అవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

## పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రక్రియను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి

### -అఖిలేష్ యాదవ్



**లక్నో మే 06( మహ ప్రభ)**
పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల ప్రక్రియను సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా స్వీకరించాలని, అలాగే ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగ్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన లక్నోలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'సీసీటీవీ ఎందుకు ప్రత్యక్ష ప్రసారం చేయడం లేదు? దానికి ఎందుకంత భయపడుతున్నారు? పశ్చిమ బెంగాల్ ఎన్నికలను సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా స్వీకరించి, ఓట్ల లెక్కింపు వీడియోను దేశ ప్రజల ముందు ఉంచాలన్నదే మా డిమాండ్," అని ఆయన అన్నారు. కాగా, ఈ సందర్భంగా ఆయన ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకలను గురించి ఆయన ప్రస్తావించారు. బెంగాల్ ఎన్నికల మాదిరిగానే.. వచ్చే ఏడాది జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే రిపీట్ అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి నేతలు చేసిన పని, ఎన్నికలను ప్రభావితం చేసిన తీరు ఇప్పుడు బట్టబయలయ్యాయి అని ఎత్తిచూపారు. ఈ మీడియా సమావేశంలో మీరు మమతా బెనర్జీని కలుస్తారా? అని ఆయన్ను విలేకరులు అడగ్గా.. తాను పశ్చిమ బెంగాల్ వెళ్తానని అఖిలేష్ బదులిచ్చారు.

## జలంధర్, అమృత్‌సర్‌లో పేలుళ్లు..

### -సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన ఆర్మీ, బీఎస్ఎఫ్



**చండీఘడ్ మే 06( మహ ప్రభ)**
పంజాబ్‌లో మంగళవారం రాత్రి రెండు పేలుళ్ల ఘటనలు జరిగాయి. జలంధర్‌లో తొలుత బీఎస్ఎఫ్ ప్రధానకార్యాలయం వద్ద బ్లాస్ట్ జరిగింది. ఆ తర్వాత అర్ధరాత్రి అమృత్‌సర్‌లో మరో పేలుడు ఘటన నమోదు అయ్యింది. ఖాసా రోడ్డులో ఉన్న ఆర్మీ కంటోన్మెంట్ ఏరియా సరిహద్దు గోడ వద్ద పేలుడు జరిగింది. గోడపై పెట్టిన ఓ షీట్ కిందపడిపోయింది.దేని వల్ల ఆ బ్లాస్ట్ జరిగిందో ఇంకా తెలియరాలేదు. కంటోన్మెంట్ ప్రాంతంలో స్వల్ప స్థాయి తీవ్రతతో పేలుడు జరిగిందని అమృత్‌సర్ రూరల్ ఎస్పీ సోహెల్ ఖాసిమ్ మీర్ తెలిపారు.రాత్రి 11.15 నిమిషాల సమయంలో భారీ శబ్దం వచ్చినట్లు తమకు సమాచారం వచ్చిందని, దీంతో హుటాహుటిన ఆ ప్రదేశానికి పోలీసు బృందాలు వెళ్లినట్లు ఆయన తెలిపారు. బౌండరీ వాల్ మీద ఉన్న ఓ షీట్ కిందపడిపోయినట్లు గుర్తించామన్నారు. క్విక్ రెస్పాన్స్ టీమ్స్, ఫోరెన్సిక్ నిపుణులు, బాంబు నిర్వీర్య దళాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఆర్మీ, బీఎస్ఎఫ్ బలగాలు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టాయి.జలంధర్‌లోని బీఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్స్ దగ్గర తొలి పేలుడు ఘటన జరిగింది. రాత్రి 8 గంటల సమయంలో బీఎస్ఎఫ్ కార్యాలయం సమీపంలో పార్క్ చేసిన స్కూటర్ పేలింది. తొలుత ఆ స్కూటర్‌కు మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత అది పేలింది. సుమారు 300 మీటర్ల దూరం వరకు దాని ప్రభావం కనిపించింది. యాక్టివా స్కూటర్ పేలుడుకు చెందిన ఘటన దృశ్యాలు సీసీటీవీకి చిక్కాయి.

## బిజెపిలో ప్రతి ఆరవ
# ఎంపీ ఓటు చోరీతోనే గెలిచారు : రాహుల్



**న్యూఢిల్లీ మే 06( మహ ప్రభ)**
లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బుధవారం బిజెపిపై తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి ఎంపీలు ఓట్ల చోరీతోనే గెలిచి పార్లమెంటుకి వెళ్లారని ఆయన ఆరోపించారు. బిజెపిలోని ప్రతి ఆరవ ఎంపి ఓట్ల చోరీతోనే ఎన్నికల్లో గెలిచారని రాహుల్ విమర్శించారు. 'ఓట్ల దొంగతనం ద్వారా కొన్నిసార్లు వ్యక్తిగత సీట్లను, మరికొన్నిసార్లు ఏకంగా ప్రభుత్వాన్నే దొంగిలిస్తారు. లోక్‌సభలో ఉన్న 240 బిజెపి ఎంపీల్లో దాదాపు ప్రతి ఆరవ ఎంపి ఓటు చోరీ ద్వారా సీటు దక్కించుకున్నారు' అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. కాగా, అలాంటి ఓటు చోరీకి పాల్పడే వారిని గుర్తించడం కష్టమేమీ కాదు. బిజెపి పరిభాషలో చెప్పాలంటే వారిని 'ఘుస్పేథియా' (చొరబాటు దారులు) అని పిలవాలా? ఉదాహరణకు హర్యానా సంగతేంటి? అక్కడ మొత్తం ప్రభుత్వమే ఒక 'ఘుస్పేథియా'. ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించడానికి వారు తమ గుప్పిట్లో ఉంచుకునే, తమకు అనుకూలంగా మలచుకునే సంస్థలే స్వయంగా 'రిమోట్ కంట్రోల్' చేస్తున్నాయి. వారి (బిజెపి నేతలు) అసలు భయం సత్యమే. ఎందుకంటే, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే, వారు ఈ రోజు 140 సీట్లు కూడా గెలుచుకోలేరు అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించినా..
# ప్రభుత్వం ఏర్పాటుకు సరిపోని బలం, ఎందుకంటే?



**చెన్నై మే 06( మహ ప్రభ)**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన టీవీకే చీఫ్ విజయ్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. మే 7 లేదా 8న సీఎంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తున్నది. అయితే టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత సంఖ్యా బలం ఇంకా సమకూరలేదు. (ఎఐఎఖఎ'ం ౧ఎఖ) తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాల్లో మాత్రమే గెలిచింది.కాగా, తిరుచిరాపల్లి తూర్పు, పెరంబూర్ స్థానాల్లో గెలిచిన విజయ్ ఒక దానిని వదులుకోవాల్సి ఉంటుంది. తిరుచి ఈస్ట్‌కు ఆయన రాజీనామా చేస్తే ఈ సంఖ్య 107కు తగ్గుతుంది. అలాగే అసెంబ్లీ స్పీకర్‌ను కూడా టీవీకే ఎన్నుకుంటుంది. దీంతో విశ్వాస తీర్మానం సమయంలో స్పీకర్ ఓటు వేయలేరు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో టీవీకే వాస్తవ సంఖ్యా బలం 106కు తగ్గిపోతుంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మెజారిటీ మార్క్ లేకపోవడంతో కూటమి ఏర్పాటు కోసం టీవీకే ప్రయత్నిస్తున్నది. బుధవారం ఆ పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఎన్నికల్లో గెలిచిన ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు కలిపితే సంఖ్యా బలం 111కు చేరుతుంది. దీంతో 118 మెజారిటీ మార్క్ కోసం ఇంకా ఏడుగురు ఎమ్మెల్యేల మద్దతు టీవీకేకు కావాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో మరికొన్ని పార్టీల మద్దతు కోసం ఆ పార్టీ ప్రయత్నిస్తున్నది. అయితే టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ బుధవారం ఉదయం ఏఐఏడీఎంకే అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామిని కలిసినట్లు తెలుస్తున్నది. అలాగే ఏఐఏడీఎంకే నుంచి గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు టీవీకేలో చేరడానికి మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఇలా జరిగితే బీజేపీ మిత్రపక్షంగా ఎన్నికల్లో పోటీ చేసిన ఏఐఏడీఎంకేలో చీలిక రావచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# యూపిలో దారుణ ఘటన

### -బాలుడిపై అత్యాచారం హత్య
### -దుండగుడిని కాల్చి చంపిన పోలీసులు





**లక్నో, మే 06( మహ ప్రభ)**
ఓ కామాంధుడిని ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు కాల్చి చంపేశారు. ఏడేళ్ల బాలుడిపై హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులపై దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా కామాంధుడు హతమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. మంగళవారం నాడు హర్దోయ్ జిల్లా మతియమౌలోని మొక్కజొన్న పొలంలో ఏడేళ్ల బాలుడి మృతదేహం లభ్యమైంది. చిన్నారిని అపహరించిన మెహనూర్ (32) అత్యాచారం చేశాడు. అనంతరం హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశాడు. ఈ నేరాన్ని లైంగిక దాడిగా కాకుండా డబ్బుల కోసం చేసిన కిడ్నాప్‌గా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈ మేరకు దొంగిలించిన సిమ్ కార్డు సహాయంతో బాధిత కుటుంబానికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే, వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేరకు మెహనూర్‌పై రూ.50 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. అయితే, హర్దోయ్ జిల్లా మల్లావన్ ప్రాంతంలో నిందితుడు మెహనూర్ ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్త బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశాయి. ఈ సందర్భంగా మెహనూర్ ఏకంగా పోలీసులపైకే కాల్పులకు తెగపడ్డాడు. కామాంధుడి దాడిలో సీనియర్ ఎస్ఓజీ అధికారి రాజేశ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరపగా.. మెహనూర్ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. అతని మృతదేహం వద్ద రెండు తుపాకులు దొరికినట్లు వెల్లడించారు. నిందితుడిని కన్నౌజ్ జిల్లావాసిగా గుర్తించినట్లు చెప్పారు. అతనికి నేర చరిత్ర ఉందని.. పలు జిల్లాల్లో దాదాపు పన్నెండు కేసులు మెహనూర్‌పై నమోదైనట్లు ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష.

**-బాధితురాలికి రూ.2 లక్షల విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు.**
**-మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.**


**మెదక్ జిల్లా -06మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో 2019 లో మతిస్థిమితం లేని మైనర్ బాలికపై జరిగిన అమానుష లైంగిక దాడి కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు వెలువరించిన తీర్పు సమాజానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. నిందితుడు అర్కెల నాగేశ్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 2,000 జరిమానా విధించడంతో పాటు, బాధితురాలి మానసిక వేదన, పునరావాసం దృష్ట్యా రూ. 2,00,000 విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో మైనర్ బాలికపై జరిగిన దారుణం అత్యంత విషాదకరమని, ఆమె మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో గర్భవతి అయినా విషయాన్ని కూడా గుర్తించలేకపోవడం సమాజాన్ని కలచివేస్తుందని ఎస్పీ అన్నారు. ఆరు నెలల తర్వాత విషయం వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసి, పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుతం



బాధితురాలికి 7 సంవత్సరాల వయస్సు గల కుమారుడు ఉన్నాడని తెలిపారు. దాదాపు ఆరు సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో ప్రజా అభియోగాధికారి బాలయ్య సమర్థంగా వాదనలు వినిపించడం, భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ స్వేత గారు బాధితురాలికి మానసిక ధైర్యం నింపి, ఆమె సాక్ష్యం చెప్పడనికి సిద్ధం చేసి కేసు విజయంలో కీలకమయ్యాయని అన్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కె.సుభాష్ , దర్యాప్తు అధికారి డీఎస్పీ కిరణ్, లైజనింగ్ అధికారులు ఎసై విఠల్, కృష్ణ, కోర్టు సీడీఓ నాగరాజు అందరి కృషి అభినందనీయమని ఎస్పీ తెలిపారు. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం అత్యంత కఠినమైందని, ఇటువంటి నేరాలకు పాల్పడేవారికి తప్పనిసరిగా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. న్యాయం ఆలస్యమైనా తప్పక జరుగుతుందనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంగా ఇస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. బాధితురాలి ధైర్యం, అధికారుల నిబద్ధత, న్యాయవ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు కలిసొచ్చినప్పుడు నేరాలకు తావుండదని అన్నారు. చిన్నారి భవిష్యత్తు కాపాడటం మనందరి బాధ్యత అని పునరుద్ఘాటించారు.

# మహిళల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

**కరీంనగర్, మే 6 (మహాప్రభ):**
కరీంనగర్ ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల (ఆటానమస్)లో 2026--27 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. సాతవాహన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఎన్ఏఏసీ గ్రేడ్-ఏ గుర్తింపు పొందిన ఈ కళాశాల మహిళల ఉన్నత విద్యకు నాణ్యత, నైపుణ్యం, ఉపాధి అవకాశాలను కలిపిన వేదికగా నిలుస్తోంది.ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ, పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థినులు నైపుణ్యాలు సాధించేందుకు అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాం (ఏఈడీపీ) ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇందులో బి.ఎస్.సి. హెల్త్‌కేర్ మేనేజ్మెంట్, బి.కాం. బ్యాంకింగ్, ఫైనాన్స్, సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ) కోర్సులు విద్యార్థినులకు ఆసుపత్రులు, బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో ప్రత్యక్ష శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను




కల్పిస్తాయని వివరించారు.అదనంగా బి.ఎస్.సి. (భౌతిక శాస్త్రాలు, జీవ శాస్త్రాలు), బి.కాం. (కంప్యూటర్ అప్లికేషన్లు), బి.ఏ. వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆధునిక డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, 18,000 పైగా పుస్తకాలతో లైబ్రరీ, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, క్రీడలు, ఉద్యోగోన్నతి కోర్సులు (యోగ, కరాటే, బ్యూటీషియన్, మొబైల్ మరమ్మత్తు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు) విద్యార్థినులకు అందుబాటులో ఉన్నాయి.ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు వెంటనే దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పరిమిత సీట్లు ఉన్నందున ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.నాణ్యమైన విద్యతో పాటు స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించే వేదికగా మహిళల డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.

# రైతులకు మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన సదస్సు

**కరీంనగర్, మే 6 (మహాప్రభ):**
: రైతు వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో అవగాహన కార్యక్రమం జరిగింది. బ్యాంకుల ద్వారా పంట రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పిఓల సేవలు, మార్కెటింగ్ అవకాశాలపై అధికారులు రైతులకు వివరించారు.స్టేట్ అబ్జర్వర్ పి. ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలు, సబ్సిడీ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి జె. భాగ్యలక్ష్మి రైతులు మార్కెట్ యార్డులు, గిడ్డంగులు, రైతు బజార్లు, ఈ-మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని చెప్పారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి ఆధునిక సాగు పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి రామానుజాచార్యులు



సహకార సంఘాల ద్వారా రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీపై వివరించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ రైతులు ఎఫ్‌పిఓలు, రైతు బజార్ల ద్వారా మెరుగైన ధరలు పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు రణధీర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు ఏజీఎం నాగరాజు, ఎఫ్‌పిఓ చైర్మన్ శంకరయ్య, మండల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని గిట్టుబాటు ధరలు పొందాలని అధికారులు పిలుపునిచ్చారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి’

**- సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**

**ఆమనగల్లు, మే 6 (మహాప్రభ):**
నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండాలో నిర్మిస్తున్న తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి ఆ తాండ సర్పంచ్ సేవ్య నాయక్ తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం



సేవాలాల్ మెరియా యాడి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని మాతను స్మరించుకోవడం తో పాటు ఆయన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఆయన వెంట నాయకులు రాజు, హేమ్లు, బద్య, సక్రు, హరియా, జై, హరిచంద్, లక్ష్మణ్, పీర్య, పాండు, కిషన్, గ్రామ పెద్దలు పలువురు ఉన్నారు.

## ఘనంగా బాచుపల్లిలో కాంగ్రెస్ నాయకుడు కొలను హనుమంత రెడ్డి జన్మదిన వేడుకలు




**కూకట్పల్లి ,మే 06( మహ ప్రభ)**
కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కొలను హనుమంత రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం బాచుపల్లిలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు కేక్ కట్ చేసి తినిపించారు శాలువా కప్పి హనుమంత రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడం ద్వారా పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని రమేష్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మి శివా చౌదరి ,హరి ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘాలు సంబదించి ఎన్నికల ప్రక్రియ లో భాగంగా సంఘల ప్రతమీక ఓటర్ల జాబితా.

**మెదక్ జిల్లా -06మే (మహాప్రభ ).**
చేనేత సహకార సంఘాలు సంబంధించిన ఎన్నికల ప్రక్రియలో భాగంగా, సంఘాల ప్రాథమిక ఓటర్ల జాబితా (ఓటర్ లిస్ట్ )ను విడుదల చేసి సంబంధిత సంఘ పరిధి మరియు చేనేత మరియు మౌళి శాఖ కార్యాలయంలో నోటీస్ బోర్డ్ ద్వారా తెలియజేస్తున్నామని సహాయ సంచాలకులు, చేనేత మరియు జౌళి శాఖ సిద్ధిపేట/ మెదక్. సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత సహకార సంఘాలు



సంబంధించిన ఎన్నికల ప్రక్రియలో భాగంగా, సంఘాల ప్రాథమిక ఓటర్ల జాబితా ను విడుదల ఈ జాబితాపై ఎవరైనా సభ్యులకు ఆక్షేపణలు లేదా సవరణలు ఉన్నచో, వాటిని సంబంధిత ఆధార పత్రాలతో కలిసి నిర్ణీత గడువులోగాసహాయ సంచాలకులు, సిద్ధిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము 08/05/2026 సమర్పించవలసిందిగా. కోరడమైనదని ఆయన అన్నారు అవసరమైన పత్రాలు: సభ్యత్వ ధృవీకరణ పత్రం, గుర్తింపు కార్డు, ‘ఇతర సంబంధిత ఆధారాలు గడువు ముగిసిన తర్వాత వచ్చిన ఆక్షేపణలను పరిగణలోకి తీసుకోబడవు. అందువల్ల, సంబంధిత సభ్యులు సమయానికి తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవలసిందిగా విజ్ఞప్తి చేయడమైనది.తదుపరి తుది ఓటర్ల జాబితా ను నిర్ణీత తేదీన ప్రకటించబడునని తెలిపారు.

## పుట్టినరోజున సేవా భావం-అనాథ ఆశ్రమంలో పండ్లు, జ్యూస్ పంపిణీ

**శివంపేట మే 6 (మహాప్రభ):**
శివంపేట్ మండలం మాజీ PACS చైర్మన్ శ్రీ చింతల వెంకట్ రామ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మగ్గంపూర్ గ్రామానికి చెందిన బేతాని అనాథ ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి పేరుతో పండ్లు మరియు పలు రకాల ఫ్రూట్ జ్యూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొంతంపల్లి గ్రామ ఉపసర్పంచ్ బొల్లారం కుమార్, జజూూ మధు యాదవ్, లక్ష్మారెడ్డి, దొంతి గ్రామ ఉపసర్పంచ్ బానగారి శ్రీనివాస్,



వార్డ్ సభ్యులు ఉప్పరి సంతోష్ కుమార్, రాజు, ఆకుల భాగయ్య, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చాకలి శ్రీనివాస్, కాలకంటి వెంకటరామిరెడ్డి అనుచరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాశక్తి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా హిందూ సమ్మేళనం

**కరీంనగర్, మే 6 (మహాప్రభ):**
చైతన్యపురి బస్తీలోని శ్రీ మహాశక్తి దేవాలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళనం వైభవంగా జరిగింది.ప్రధాన




వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ జయదేవ్ జీ మాట్లాడుతూ హిందూ సమాజం కులాలుగా విడిపోకుండా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందూ ఐక్యతే సమాజానికి వెయ్యి ఏనుగుల బలం అని, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రయాణం దేశహితం, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా కొనసాగిందని, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ‘పంచ పరివర్తన్’ అంశాలను సమాజంలోకి తీసుకెళు _న్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, చైతన్యపురి హిందూ సమ్మేళన సమితి బాధ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంలో హిందూ ఐక్యతకు పిలుపునిచ్చిన సమ్మేళనం ఆధ్యాత్మిక శోభతో ముగిసింది.

# సమష్టిగా పనిచేసి మన్ననలు పొందాలి


**- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా**



**ఆమనగల్లు, మే 6 (మహాప్రభ):** సమష్టిగా పనిచేసి ప్రజల మన్ననలు పొంది విజయవంతం కావాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా కోరారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో బుధవారం ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన అబ్దుల్ ఖాదర్ లను మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్ తో కలిసి చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్ అంజయ్య గుప్తా, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రూపం వెంకట్ రెడ్డి, అబ్దుల్ రహీం తదితరులు ఉన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్ గా గంప వెంకటేష్ బాధ్యతల స్వీకరణ

**- అసిస్టెంట్ రిజిస్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టిన గంప**







**ఆమనగల్లు, మే 6 (మహాప్రభ):** హైకోర్టు ఆదేశాల మేరకు ప్రాథమిక సహకార సంఘం పాలకవర్గం కొలువుదీరింది. బుధవారం ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గా గంప వెంకటేష్ గుప్తా బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా డీసీఓ కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ రిజిస్టర్ ఆంజనేయులు వెంకటేష్ గుప్తాకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా సన్న చిన్నకార రైతులు ప్రాథమిక సహకార సంఘం వారి ఆజమాయిషి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు హైకోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వం ఆగమేఘాల మీద సింగల్ విండో పాలకవర్గాలను కొనసాగిస్తూ జీవో విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలతో పాటు రైతులకు సబ్సిడీపై పంట రుణాలు అందివ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటామని వెంకటేష్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్లు ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి పద్మాకర్ రెడ్డి, సిబ్బంది దేవేందర్, అల్లాజీ, మహేష్ పాల్గొన్నారు.

# అచ్చంపేటలో శాంతి కమిటీ సమావేశం



**అచ్చంపేట, మే 6 (మహాప్రభ):** ఈ నెల 27న జరగనున్న బక్రీద్ పండుగను మతసామరస్యంతో, శాంతియుతంగా నిర్వహించాలని అచ్చంపేట డిఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "యువత అవాంఛనీయ సంఘటనలకు దూరంగా ఉండాలి, మంచి మార్గంలో నడవాలి. మద్యం, అల్లర్లు, వివాదాలకు దూరంగా ఉండి శాంతి భద్రతలకు సహకరించాలి" అని అన్నారు. ఈ సమావేశంలో సిఐ నాగరాజు, ఎస్సై సద్దాం హుస్సేన్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో చెత్త సమస్యతో ఇబ్బందులు ఎదుర్కుంటున్న ప్రయాణికులు



**కరీంనగర్, మే 6 (మహాప్రభ):** జిల్లా కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం భారీగా పేరుకుపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కుప్పల నుంచి వస్తున్న దుర్వాసనతో బస్సుల కోసం వేచి ఉన్న వారు ముక్కు మూసుకుని నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మున్సిపల్, ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్‌ను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన బస్టాండ్‌లో చెత్త సమస్యపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తిమ్మకపల్లిలో సీసీటీవీ నిఘా ప్రారంభం





**-గ్రామ భద్రతకు కీలక అడుగు**
**-- డీఎస్పీ మధుసూదన్**



**కామారెడ్డి, మే 6 (మహాప్రభ)** జిల్లాలో గ్రామ భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా తిమ్మకపల్లి గ్రామంలో సీసీటీవీ నిఘా వ్యవస్థను ప్రారంభించారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ గ్రామంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన 8 సీసీటీవీ కెమెరాలను కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. "వంద మంది పోలీసులు చేసే పనిని ఒక్క సీసీటీవీ కెమెరా చేస్తుంది" అని వ్యాఖ్యానించారు. కెమెరాల ద్వారా గ్రామంలో నిరంతర నిఘా కొనసాగుతుందని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నప్పుడు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని వివరించారు. గ్రామ భద్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, పోలీసులతో సమన్వయం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఇలాంటి నిఘా వ్యవస్థలను విస్తరించడం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, ఇతర పోలీస్ అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన గ్రామస్తులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# చిన్న గొట్టుముక్కల చౌరస్తాలో నూతన చలివేంద్రం ఏర్పాటు



**శివంపేట మే 6 (మహాప్రభ):** శివంపేట మండల పరిధిలోని చిన్న గొట్టిముక్కల గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు గ్రామ యువకులు ఆధ్వర్యంలో కృప మిల్క్ శ్రీనివాస వారి సహాయ సహకారాలతో చిన్న గొట్టిముక్కల చౌరస్తాపై చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. వేసవికాలం దృష్ట్యా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం చొరవ తీసుకొని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సింగయ్యపల్లి నారాయణరావు, ఉపసర్పంచ్ పాపయ్య చారి, మాజీ సర్పంచ్ బాలమనణి- నరేందర్ గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, గడిల రామచంద్రరావు, సలీం, భానోత్ కిషన్ నాయక్, మనీ గౌడ్, యోగేందర్, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు ఎరుకలి బిక్షపతి, మదిరే అశోక్, పి రవీందర్ రియాజ్, కర్రె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల వద్ద నిలువు దోపిడీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- బీజేపీ నేతల ఆరోపణ**



**కరీంనగర్ మే 6 (మహాప్రభ):** కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్దంపూర్ రాజీవ్ రహదారిపై బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పండించిన ధాన్యానికి తాలుతరుగు పేరుతో అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఏ గ్రేడ్ వద్దను కామన్ గ్రేడ్ కింద లెక్కపెట్టి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన రైతు భరోసా హామీలు అమలు కాలేదని, రుణమాఫీ, కౌలు రైతులకు 15 వేల రూపాయలు, రైతు కూలీలకు 12 వేల రూపాయలు ఇవ్వాలన్న వాగ్దానాలు నెరవేరలేదని అన్నారు. తాలుతరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులపై దోపిడీని వెంటనే ఆపాలని బీజేపీ నేతలు హెచ్చరించారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి



**దోమ మండలం మే 6 (మహాప్రభ):** దోమ మండల కేంద్రంలో వరి కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాలి శివ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్ల కవిత, వార్డు మెంబర్స్, సీనియర్ నాయకులు అధికారులు, గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా పోలీసు బదిలీలు

**-కౌన్సిలింగ్‌తో 146 మందికి స్థానచలనం**






**కామారెడ్డి, మే 6: (మహాప్రభ)** జిల్లాలో పోలీసు సిబ్బంది బదిలీలను పారదర్శక విధానంలో చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ సబ్‌డివిజన్‌ల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి కౌన్సిలింగ్ పద్ధతిలో బదిలీలు నిర్వహించారు. ఈ ప్రక్రియలో మొత్తం 146 మందికి స్థానచలనం కల్పించారు. వారిలో 8 మంది ఏఎస్సైలు, 18 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 111 మంది కానిస్టేబుళ్లు, ఎంసీ సెక్షన్‌కు చెందిన 9 మంది సిబ్బంది ఉన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆధారాలపై పూర్తిగా పారదర్శకంగా బదిలీలను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఐదు సంవత్సరాలు పూర్తిచేసిన కానిస్టేబుళ్లు, నాలుగు సంవత్సరాలు పూర్తిచేసిన హెడ్ కానిస్టేబుళ్లు, మూడు సంవత్సరాలు పూర్తిచేసిన ఏఎస్సైలతో పాటు పదోన్నతి పొందిన సిబ్బందిని పరిగణనలోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. విల్లింగ్ స్టేషన్లు, దాంపత్య అంశాలు, సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డు వంటి అంశాలను పరిశీలించి బదిలీలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పారదర్శక బదిలీలు బాధ్యతాయుత విధులకు పునాది అని పేర్కొన్నారు. సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా పని చేయాలని, సేవా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని అన్నారు. పోలీసు అధికారులుగా నైతికతకు ప్రాధాన్యం ఇస్తూ ఉత్తమ సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్, ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

**- బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్.**



**మెదక్ జిల్లా -06మే (మహాప్రభ ).** శ్రీరాముడు అంటే పైసలు రాలుతాయ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల్ని బీజేపీ పార్టీ పూర్తి గా ఖండిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో హిందూ గాళ్ళు,బొందు గాళ్ళు అని మాట్లాడితే ప్రస్తుతం ఆయన ఫామ్ హౌస్ కె పరిమితం అయ్యాడని ఆరోపించారు. ప్రస్తుతం మంత్రిగా ఉన్న కొండా సురేఖ హిందువులపై చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. వెంటనే ఆమెను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.

# బిజినెస్

## సెన్సెక్స్ 940 పాయింట్ల పరుగు




**ముంబయి**
: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయన్న సానుకూల వార్తలతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా, ఇరాన్ దేశాలు ఒక ఒప్పందానికి చేరువయ్యాయన్న సమాచారంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా 9 శాతం క్షీణించి 100 డాలర్ల మార్కుకు చేరువవటం మార్కెట్‌కు మద్దతునిచ్చింది. దీంతో చివరి గంటలో సెన్సెక్స్ 940 పాయింట్లు ఎగబాకి 77,958కు చేరుకుంది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 298 పాయింట్ల లాభంతో 24,330 వద్ద ముగిసింది. ఈ ఒక్కరోజే ఇన్వెస్టర్ల సంపద సుమారు రూ.6 లక్షల కోట్లు పెరగడం విశేషం. ఇండిగో షేర్లు 6 శాతం మేర దూసుకుపోగా.. ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు రిలయన్స్, ఎల్‌అండ్‌టి వంటి దిగ్గజాలు స్వల్ప నష్టాలను చవిచూశాయి. రూపాయి విలువ కూడా 56 పైసలు బలపడి 94.62 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర ఔన్సు 4700 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మొత్తానికి యుద్ధ మేఘాలు తొలగిపోతున్నాయన్న ఆశలు దలాల్ స్ట్రీట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి

## సీన్ రివర్స్.. బంగారం ధరల తగ్గుదలకు బ్రేక్..

**-ఒక్కసారిగా భారీగా పెరిగిన రేట్లు.. ఎంతంటే..?**

బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి బిగ్ షాక్ తగలింది. గత కొంతకాలంగా నెమ్మదించిన గోల్డ్ రేట్లు.. ఇవాళ ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఒకేసారి ధరలు భారీగా పెరిగాయి. దీంతో గత కొద్ది రోజులుగా జరుగుతున్న తగ్గుదలకు బ్రేక్ పడినట్లయింది. పెళ్లిళ్ల సీజన్ క్రమంలో బంగారం కొనాలనుకునేవారికి ఇది మింగుడు పడని విషయంగా మారింది. ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ యుద్ధం మొదలైన క్రమంలో ధరలు పెరుగుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. బుధవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,310 వద్ద కొనసాగుతోంది. మంగళవారం రూ.1,49,180 వద్ద స్థిరపడగా.. నిన్నటితో పోలిస్తే ఇవాళ రూ.2130 పెరిగాయి. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,38,700 వద్ద ఇప్పుడు కొనసాగుతోండగా.. నిన్న రూ.1,36,750 వద్ద స్థిరపడ్డాయి. నిన్నటితో చూసుకుంటే రూ.1950 పెరిగింది.ఇక విజయవాడ, విశాఖపట్నంలో కూడా అవే ధరలు ఉన్నాయి. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,280 వద్ద ఉండగా.. నిన్న రూ.1,50,770 వద్ద ఉన్నాయి. ఇవాళ ఒక్కరోజే రూ.2510 పెరిగింది. ఇక 22 క్యారెట్ల ధర



మంగళవారం రూ.1,38,200 వద్ద ఉండగా.. ఇవాళ రూ.1,40,500కి చేరుకుంది. బుధవారం రూ.2300 పెరుగుదల నమోదైంది.దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల ప్యూర్ బంగారం ధర రూ.1,51,440 వద్ద ట్రేడవుతుండగా.. నిన్న రూ.1,49,230 వద్ద స్థిరపడ్డాయి. నిన్నటితో పోల్చుకుంటే రూ.2210 పెరిగింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,38,850 వద్ద కొనసాగుతున్నాయి. బెంగళూరులో 24 క్యారెట్ల రేటు రూ.1,51,310 వద్ద ఉండగా.. 22 క్యారెట్లు రూ.1,38,700 వద్ద కొనసాగుతున్నాయి.అటు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. బెంగళూరులో కిలో వెండి రూ.2.65 లక్షల వద్ద కొనసాగుతుండగా.. నిన్న రూ.2.55 లక్షల వద్ద ఉంది. ఇవాళ కిలో వెండిపై రూ.10 వేలు పెరిగింది. ఇక హైదరాబాద్‌లో కేజీ వెండి రూ.2.70 లక్షలుగా ఉండగా.. నిన్న రూ.2.65 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో వెండిపై రూ.5 వేలు పెరిగింది.

## మహీంద్రా రూ.33 డివిడెండ్

**న్యూఢిల్లీ, మే 5**
: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.5,259.91 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,541.85 కోట్ల లాభంతో పోలిస్తే 48.5 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు ఎగబాకినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. మరోవైపు, 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,97,792.78 కోట్ల ఆదాయంపై రూ.18,621.71 కోట్ల నికర లాభాన్ని




ఆర్జించింది. కంపెనీ బోర్డు సమావేశమై రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకూ రూ.33 తుది డివిడెండ్‌ను ప్రకటించింది.

## వ్యాపారాలు, పెట్టుబడులపై ధోని దృష్టి

క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరుగాంచిన ఎంఎస్ ధోని, రిటైర్మెంట్ తర్వాత తన దృష్టిని పూర్తిగా వ్యాపారాలు, పెట్టుబడులపై కేంద్రీకరించాడు. సాధారణంగా సెలబ్రిటీలు రియల్ ఎస్టేట్ లేదా సినిమా రంగాల్లో పెట్టుబడులు పెడతారు. కానీ, ధోని మాత్రం భవిష్యత్తు ఉన్న స్టార్టప్‌లు, స్టాక్ మార్కెట్ రంగాలను ఎంచుకున్నాడు. ఆయన ఎంచుకున్న కంపెనీలు ఇప్పుడు మల్టీబ్యాగర్లుగా మారి ఇన్వెస్టర్లను ఆశ్చర్యపరుస్తున్నాయి. ముఖ్యంగా డ్రోన్ తయారీ, ఈ-కామర్స్ రంగాల్లో ఆయన చేసిన పెట్టుబడులు ఇప్పుడు భారీ లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ధోని పోర్ట్‌ఫోలియోలో అత్యంత కీలకమైనది 'గరుడ ఏరోస్పేస్'. ఈ చెన్నైకి చెందిన డ్రోన్ స్టార్టప్‌లో ధోని కేవలం బ్రాండ్ అంబాసిడర్‌గానే కాకుండా భారీగా పెట్టుబడి పెట్టారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న తరుణంలో, ఈ కంపెనీ విలువ అనూహ్యంగా పెరిగింది. ధోని సుమారుగా ఒక కోటి రూపాయలకు పైగా ఈ కంపెనీలో ఇన్వెస్ట్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కంపెనీ ఐపీఓ కి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం, ఈ కంపెనీ లిస్టింగ్ అయిన తర్వాత ధోని పెట్టిన పెట్టుబడి పది రెట్లు పెరిగే అవకాశం ఉంది. చిన్న వ్యాపారుల కోసం డిజిటల్ లెడ్జర్ సేవలను అందించే 'ఖాతాబుక్' యాప్‌లో ధోని 2020లో పెట్టుబడి పెట్టాడు. ఈ





సంస్థలో ఆయన వాటా కోట్లాది రూపాయల విలువ చేస్తుంది. అదేవిధంగా, సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయ సంస్థ 'కార్స్ 24' లో కూడా ధోని భాగస్వామిగా ఉన్నాడు. కేవలం ప్రచారం కోసమే కాకుండా, కంపెనీ వ్యూహాల్లో కూడా ఆయన భాగస్వామ్యం వహిస్తుంటాడు. ఈ రెండు సంస్థలు ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో అగ్రగామిగా కొనసాగుతుండటంతో ధోని సంపద నిలకడగా పెరుగుతోంది. స్టాక్ మార్కెట్లోకి అరంగేట్రం చేసిన 'డ్రోన్ ఆచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్' షేర్లను ధోని ప్రీ-ఐపీఓ దశలోనే కొనుగోలు చేశాడు. ఆయన సుమారుగా 6,600 షేర్లను ఒక్కో షేరు 54 రూపాయల ధర (మొత్తం రూ. 3,56,400) వద్ద కొనుగోలు చేశాడు. లిస్టింగ్ రోజునే ఈ షేరు ధర 100 రూపాయల మార్కును దాటి ఇన్వెస్టర్లకు బంపర్ లాభాలను ఇచ్చింది. ప్రస్తుతం ఈ షేరు విలువ ధోని కొన్న ధర కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండటం ఆయన దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహానికి నిదర్శనం. స్టాక్ మార్కెట్ పెట్టుబడులే కాకుండా, రాంచీలోని తన సొంత ఫామ్ హౌస్‌లో ధోని సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. అక్కడ పండించే కూరగాయలు, పండ్లను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. దీనికి తోడు 'సెవెన్' (7) అనే బ్రాండ్ ద్వారా దుస్తులు, పాదరక్షల వ్యాపారంలోనూ ఆయన రాణిస్తున్నారు. ఫిట్‌నెస్ రంగంలో 'ధోని స్పోర్ట్స్ ఫిట్' జిమ్‌ల నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా విస్తరించి ఉంది.ధోని పెట్టుబడుల సరళిని గమనిస్తే ఆయన ఎప్పుడూ స్వల్పకాలిక లాభాల కోసం వెంపర్లాడరని అర్థమవుతుంది. భవిష్యత్తులో ఏ రంగానికి డిమాండ్ ఉంటుందో ముందే ఊహించి, ఆయా రంగాల్లోని నమ్మకమైన కంపెనీల్లో పెట్టుబడి పెట్టాడు. క్రమశిక్షణ, సహనం, సరైన విశ్లేషణ ఉంటే స్టాక్ మార్కెట్‌లో ఎవరైనా విజయం సాధించవచ్చని ఆయన నిరూపిస్తున్నాడు. ప్రస్తుతం ధోని మొత్తం ఆస్తుల విలువ 1000 కోట్ల రూపాయలు దాటినట్లు అంచనా, అందులో గణనీయమైన భాగం ఇలాంటి స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ల ద్వారానే సమకూరింది.
..

# స్పోర్ట్స్

## ఐపీఎల్ 2026 ఫైనల్ అహ్మదాబాద్‌లో.


### రెండు వేదికల్లో ప్లేఆఫ్ మ్యాచ్‌లు



**న్యూఢిల్లీ:**
ఈ యేటి ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ప్లే ఆఫ్ గేమ్స్‌కు చెందిన వేదికల వివరాలను కూడా ఇవాళ బీసీసీఐ రిలీజ్ చేసింది. మే 31వ తేదీన .. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు. ఇక క్వాలిఫయర్ 1 మ్యాచ్‌ను ధర్మశాలలో, మరో రెండు ప్లేఆఫ్ మ్యాచ్‌లను న్యూ చండీఘడ్‌లో నిర్వహించనున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. 2022, 2023 సీజన్లకు చెందిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరిగిన విషయం తెలిసిందే. క్వాలిఫయర్ 1 మ్యాచ్‌ను మే 26వ తేదీన నిర్వహించనున్నారు. లీగ్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ మ్యాచ్‌ను ఆడనున్నాయి. ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇక మే 27వ తేదీన మూడు, నాలుగవ స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. న్యూ చండీఘడ్‌లోని కొత్త స్టేడియంలో మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇక ఇదే వేదికపై మే 29వ తేదీన క్వాలిఫయర్ 1 మ్యాచ్‌ను నిర్వహిస్తారు

## పంత్‌ను చూసి నేర్చుకోండి: యువరాజ్ సింగ్

టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా తన శిష్యులపై ఫన్నీగా విరుచుకుపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్ ముంగిట తనకు అండగా నిలిచిన యువీకి రిషబ్ పంత్ ఓ ఖరీదైన గోల్ఫ్ క్లబ్‌ను కానుకగా ఇచ్చాడు. ఈ బహుమతిని అందుకున్న యువీ.. శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి ఇతర యువ ఆటగాళ్లను ట్యాగ్ చేస్తూ, "కొంచెం సిగ్గు తెచ్చుకోండి.. పంత్‌ను చూసి నేర్చుకోండి" అంటూ సరదాగా ఆటపట్టించాడు. గత కొంతకాలంగా సరైన ఫామ్‌లో లేక టీ20 వరల్డ్ కప్ జట్టులోనూ చోటు దక్కించుకోలేక ఇబ్బంది పడుతున్న రిషబ్ పంత్.. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు యువరాజ్ సింగ్‌ను కలిసి గైడెన్స్ కోరాడు. యువీ తన మెంటల్ స్ట్రెంత్, కాన్ఫిడెన్స్ పెంచడంలో కీలక పాత్ర పోషించారని రిషబ్ పంత్ భావించాడు. అందుకే కృతజ్ఞతగా, రిటైర్మెంట్ తర్వాత గోల్ఫ్ ఆడుతున్న యువీకి గోల్ఫ్ క్లబ్‌ను గిఫ్ట్‌గా పంపాడు. దీనిపై ఒక





నోట్ రాస్తూ.. "ప్రియమైన యువీ పాజీ, మీ సపోర్ట్, గైడెన్స్‌కు ధన్యవాదాలు. గోల్ఫ్ కోర్స్‌లో కలుద్దాం.. లవ్ రిషబ్ పంత్" అని పేర్కొన్నాడు. యువరాజ్ సింగ్ ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. తన పర్యవేక్షణలో శిక్షణ పొందిన మిగతా కుర్రాళ్లపై సెటైర్లు వేశాడు. ముఖ్యంగా శుభ్‌మన్ గిల్‌ను నంబర్ 2 బేషరమ్ అని, అభిషేక్ శర్మను నంబర్ 1 బేషరమ్ అని సరదాగా పిలుస్తూ.. పంత్‌ను చూసి నేర్చుకోవాలని చురకలు అంటించాడు. ప్రభ్‌సిమ్రాన్ సింగ్, నమన్ ధీర్, అబ్దుల్ సమద్, ప్రియాన్ష్ ఆర్య వంటి ప్లేయర్లను కూడా ఈ పోస్ట్‌లో ట్యాగ్ చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. యువరాజ్ సింగ్‌తో శిక్షణ పొందినప్పటికీ.. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రిషబ్ పంత్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 9 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 204 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన సగటు 25.50 కాగా.. స్ట్రైక్ రేట్ 128.30గా ఉంది. రిషబ్ పంత్ వైఫల్యంతో పాటు ఆయన జట్టు కూడా 9 మ్యాచ్‌ల్లో కేవలం 2 విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. దీంతో ఆ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి దాదాపుగా నిష్క్రమించినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు.

# బర్త్‌డే స్పెషల్..

## శివకార్తికేయన్ 'సియోన్' నుంచి భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సియోన్ నుంచి తాజాగా అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే పుట్టినరోజును పురస్కరించుకుని, చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ స్పెషల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో భాగ్యశ్రీ అచ్చమైన గ్రామీణ యువతిగా, నీలి రంగు చుడిదార్ ధరించి, నుదుట కుంకుమ మరియు జడలో మల్లెపూలతో ఎంతో సహజంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆమె చేతిలో నెమలి ఈక పట్టుకుని సీరియస్ లుక్‌తో ఎవరినో హెచ్చరిస్తున్నట్లుగా ఉన్న హావభావాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. గాజుల దుకాణం నేపథ్యంలో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఇది పక్కా విలేజ్ బ్యాక్‌డ్రాప్ మాస్ ఎంటర్‌టైనర్ అని స్పష్టమవుతోంది.లెజెండరీ నటుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్‌పై ఆర్. మహేంద్రన్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టార్ కంపోజర్ సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం శివకార్తికేయన్ కెరీర్‌లో మరో విభిన్నమైన ప్రయత్నంగా నిలవనుంది. తెలుగులో 'మిస్టర్ బచ్చన్' సినిమాతో గుర్తింపు పొందిన భాగ్యశ్రీ బోర్సేకు ఇది కోలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్ కాగా, ఈ చిత్రం 2026 అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.






పరువాలు చూపిస్తున్న ఇస్మార్ట్ పోరి..

# ఎల్లమ్మ మూవీలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్



బలగం' వంటి హృదయాన్ని తాకే ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి తన రెండో సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతు న్నారు. 'ఎల్లమ్మ' అనే ప్రత్యేకమైన టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై సాగుతున్న ఉత్కంఠకు ఇప్పుడు తెరపడుతున్నట్లు సమాచారం.తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో నటనకు అత్యంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కోసం దర్శకుడు చాలా జాగ్రత్తగా హీరోయిన్‌ను ఎంపిక చేయాలని భావించారు. ప్రారంభంలో ఈ పాత్ర కోసం సాయి పల్లవిను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే డేట్స్ సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించింది. ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. వీరితో పాటు శృతి హాసన్, భాగ్యశ్రీ బోర్సే, కన్నడ నటి రుక్మిణి వసంత్ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం 'సీతా రామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఫైనల్ అయినట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకునే మృణాల్ ఈ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఇక ఈ చిత్రంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఫేమస్ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. అంతేకాదు, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయాలు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా రూపొందుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్‌లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. హీరోయిన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



# ఆ హీరో నన్ను బలవంతం చేస్తే చెంప మీద కొట్టా.!.

ఇటీవల కాలంలో తరచుగా మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు ఎక్కువగా వార్తలలో ఉంటున్నాయి. పోలీసులు ఎన్నిచట్టాలు తీసుకొచ్చిన కూడా కామాంధులు మాత్రం మారడంలేదు. ఇక సినిమారంగంలో వేధింపుల అంశం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చాలా మంది హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు చాన్స్ లు దొరకాలంటే వేధింపులను ఎదుర్కోవాల్సిందే అన్నట్లు సిట్యూవేషన్ తయారైంది. చాలా మంది హీరోయిన్లు తమ కెరీర్ లో ఎదుర్కొన్న అనేక వేధింపుల ఘటనలను పబ్లిక్ గాచెప్పుకుని బాధపడ్డారు. కొంతమంది పరువు పోతుందని తమకు జరిగిన అన్యాయంను మౌనంగా భరించిన వారు కూడా ఉన్నారు. మొత్తంగా కొన్ని చోట్ల హీరోలు, డైరెక్టర్ లు పడక పంచుకుంటే లేదా షూటింగ్ సమయంలో హీరోయిన్లతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలు కొకొల్లలు. తాజాగా..స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తననై ఒక పాన్ ఇండియా హీరో వేధింపులకు పాల్పడ్డాడని చెప్పడం పెద్ద దుమారంగా మారింది. పూజా హెగ్డే ఒకప్పుడు ముకుంద , దువ్వాడ జగన్నాథం, అరవింత సమేత వీర రాఘవ, అల వైకుంఠ పురం, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, రాధే శ్యామ్ , ఆచార్య వంటి మూవీస్ లలో అగ్రహీరోలతో నటించిన విషయం తెలిసిందే. అదే విధంగా కూలీ, రెట్రోల్లో కూడా నటించింది. ఇదిలా ఉండగా ఇటీవల గతంలో లాగా పూజా హెగ్డే హిట్ సినిమాలతో ఫామ్ లో లేరని చెప్పుకోవచ్చు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే చేసిన కామెంట్స్ ఇండస్ట్రీలో రచ్చగా మారాయి. కొన్ని నెలల క్రితం ఒక పాన్ ఇండియా మూవీలో నటించానని, అప్పుడు షూటింగ్ బ్రేక్ సమయంలో హీరో డైరెక్ట్ గా తన కారవాన్ లోకి వచ్చాడన్నారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండానే రావడమే కాకుండా.. ముట్టుకోవడానికి కూడా ప్రయత్నించాడని చెప్పింది. అతడ్ని చూడగానే షాక్ అయ్యానని, వెళ్లిపోమ్మని చెప్పిన వినలేదని, అసభ్యంగా ప్రవర్తించడంతో అతడ్ని చెంపదెబ్బ కొట్టినట్లు పూజా హెగ్డే షాకింగ్ నిజంను రివీల్ చేసింది. అతడ్ని కొట్టగానే సీరియస్ గా బైటకు వెళ్లిపోయాడని ఆతర్వాత నాతో మాట్లాడలేదని పూజా చెప్పుకొచ్చింది. ఆ తర్వాత మూవీలోని సీన్లన్ని తన డూప్ పెట్టిషూటింగ్ లను పూర్తి చేశారని తనకు ఎదురైన చేదు అనుభవంను పూజా హెగ్డే బైటపెట్టింది. ప్రస్తుతం పూజా హెగ్డే చేసిన వ్యాఖ్యలు నెట్టింట దుమారంగా మారాయి. అసలు పూజా హెగ్డే తో చెంపదెబ్బలు తిన్న ఆ పాన్ ఇండియా హీరో ఎవరని అభిమానులు పూజాకు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తంగా పాన్ ఇండియా హీరో అంటూ ఒక హింట్ అయితే ఇచ్చిందని, దీన్నిబట్టి కొంత మంది పేర్లను నెటిజన్లు వైరల్ చేస్తున్నారు. మొత్తంగా పూజా హెగ్డే కామెంట్స్ ఇండస్ట్రీలో మరోసారి క్యాస్టింగ్ కౌచ్ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది.

# లెనిన్ మూవీలో భాగ్యశ్రీ లుక్ విడుదల




'లెనిన్'లో అఖిల్‌తో కలిసి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు శు భాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్‌లో ఆమె పౌరాణిక లుక్‌లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్‌తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్‌ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్' చిత్రం రూపుదిద్దుకొంటోంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com